

# మే ఫస్ట్ వీక్‌లో పార్టీ

మంచి ముహూర్తంలో ఏర్పాటు చేస్తాం
మా పార్టీ మదర్ బోర్డ్ తెలంగాణ
బోధన్, సిద్ధిపేట సహా ఎక్కడి నుంచైనా పోటీ చేస్తా
కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ లను ప్రశ్నిస్తూనే ఉంటాం
ఇప్పుడు రాష్ట్రంలో తామే ప్రధాన ప్రతిపక్షం
బీఆర్ఎస్ లీడర్లతో టచ్ లో ఉన్నారు..
జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

8

www.spotvoicenews.com
గురువారం 19, ఫిబ్రవరి 2026
స్పాట్ వాయిస్
తెలుగు దినపత్రిక
వరంగల్ | సంపుటి : 11 సంచిక: 109 | పేజీలు: 8 | వెల: రూ..3

## పదిచోట్ల ఉప ఎన్నికలు ఖాయం..

- కడియంను చూసి ప్రజలు నవ్వుకుంటాండ్లు..
- దమ్ముంటే రాజీనామా చేసి గెలువు.. : ఎమ్మెల్యే కేపీ వివేకానంద

2

## కేసీఆర్ ఒక్కడి వల్లే రాష్ట్రం రాలే..



- జాతిపిత అనడానికి సిగ్గుండాలి..
- ఏం చేసిండని జాతిపిత అయిండు..
- తెలంగాణ వాళ్ల అయ్య సొత్తా..?
- కేసుల పాలైన కల్వకుంట్ల కుటుంబం
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

7

# పేరుకు వాళ్లు.. సొమ్ముకు వీళ్లు...

హాస్టళ్లలో 70కి పైగా అడ్డా లేబర్లు అవసరమంటూ ఇండెంట్


డమ్మీ పేర్లతో బిల్లులు బుక్కేశారు..

మెస్ బిల్లులు ఎక్కడని ప్రశ్నిస్తున్న విద్యార్థులు

- కేయూ హాస్టల్ నిర్వహణలో అవినీతి బాగోతం..
- విద్యార్థి సంఘాలు ఆందోళన చేసినా పట్టించుకోని కేయూ పెద్దలు
- బాధ్యతల నుంచి తప్పిస్తే సరిపోతుందా..? రికవరీ ఉండదా..?

కేయూ హాస్టళ్ల నిర్వహణలో జరిగిన అవినీతి అంతాఇంత కాదు. తరిచి చూస్తే ఎన్నో విస్తుపోయే నిజాలు వెలుగుచూస్తున్నాయి. కేయూ కామన్ మెస్, మహిళా హాస్టల్ మెస్ లలో 70 కి పైగా అడ్డా లేబర్లు అవసరం ఉన్నట్లు హాస్టల్ మాజీ డైరెక్టర్ వీసీ, రిజిస్ట్రార్ ఆమోదం తీసుకుని, డమ్మీ పేర్లతో బిల్లులు పెడుతూ స్టూడెంట్స్ సొమ్మును కాజేస్తున్నట్లు విద్యార్థి సంఘాలు అనేక సార్లు ఆందోళనలు చేపట్టాయి. ఇక హాస్టల్ డైరెక్టర్ అక్రమాలపై విచారణ కమిటీ వేసి రెండు నెలలైనా ఇప్పటి వరకు కమిటీ రిపోర్టు సమర్పించకపోవడం వెనుక అనేక అనుమానాలకు తావిస్తోంది. అయితే యూనివర్సిటీ హాస్టల్ ఆఫీస్ లో అవినీతి అక్రమాలు రోజుకోటి బయట పడుతూనే ఉన్నా, వీసీ, రిజిస్ట్రార్లు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు జోరందుకున్నాయి. - స్పాట్ వాయిస్, ఓరుగల్లు

7




## వారిపై చర్యలు ఉండవా..?

(మరో సంచికలో)



## పిలిస్తే వచ్చేవాళ్లం..

- వచ్చే జాతరకు తప్పకుండా ఆహ్వానిస్తాం..
- ఆహ్వానం అందితే జాతరకు వస్తాం..
- మంత్రి సీతక్క రాహుల్ గాంధీ మధ్య సరదా సంభాషణ
- వనదేవతల వీరగాథను వివరించిన సీతక్క
- ఆసక్తిగా విన్న కాంగ్రెస్ పెద్దలు రాహుల్ గాంధీ ఖర్గే

7



## కర్రెగుట్టల్లో ఎన్‌కౌంటర్

- ఐదుగురు మావోలు హతం..
- దేవ్ జీ, కేసా సోధికోసం వేట..
- కేంద్ర డెడ్ లైన్ కు 40 రోజులే
- కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న బలగాలు

2

# మోడల్ సోలార్ విలేజ్‌గా ఆత్మకూరు

**సోలార్ ప్యానల్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి**

**హాజరైన డీసీసీ అధ్యక్షుడు ఇనగాల, కలెక్టర్**

**స్పాట్ వాయిస్, ఆత్మకూరు:** ఆత్మకూర్ గ్రామం మోడల్ సోలార్ విలేజ్ గా ఎంపిక కావడంతో కలెక్టర్ స్నేహ శబరీష్, డీసీసీ అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సోలార్ ప్యానెల్స్‌ను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సోలార్ వ్యవస్థను విస్తృతంగా ప్రోత్సహిస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలను ఇంధన స్వయంసమృద్ధి, నెట్–జీరో దిశగా తీసుకెళ్లే వినూత్న కార్యక్రమంలో భాగంగా ఆత్మకూర్ గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపిక చేయడం గర్వకారణమన్నారు. సోలార్ విద్యుత్ వినియోగం పెంపొందించి, విద్యుత్ ఖర్చులను తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందన్నారు. సోలార్ పవర్ వ్యవస్థ ద్వారా విద్యుత్ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని, నిరంతర విద్యుత్ సరఫరా సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ సబ్సిడీలు, దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనం పొందుతారని అన్నారు. అనంతరం ఆత్మకూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశానికి హాజరయ్యారు. పేదల కండ్లలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆత్మకూర్ లో 1,825 నివాస విద్యుత్ వినియోగదారులు ఉండగా.. మొదటి విడతలో 1171 గృహజ్యోతి సర్వీసులకు సోలార్ ప్యానెల్స్ అందజేశారు. ఒక్కో ఇంటిపై 2 కిలోవాట్ల సోలార్ యూనిట్ ల ఏర్పాటు చేశారు. అలాగే 468 వ్యవసాయ పంప్‌సెట్‌లకు 7.5 కిలోవాట్ల సోలార్ యూనిట్లను అమర్చనున్నట్లు కలెక్టర్ స్నేహ శబరిష్ వెల్లడించారు. ₹48.35 కోట్ల వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తోందన్నారు.







## కొటంచ ఆలయ చైర్మన్‌గా నాయినేని సంపత్ రావు

**ప్రమాణ స్వీకారం చేసిన కొటంచ ఆలయ పాలక వర్గం**

**హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

స్పాట్ వాయిస్, రేగొండ: రేగొండ మండలం కొడవటంచ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. దేవాలయ నూతన చైర్మన్‌గా నాయినేని సంపత్ రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శాలువాతో సన్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవాలయాలు భక్తి, ఆధ్యాత్మికతకు నిలయాలే కాకుండా సమాజానికి సాంస్కృతిక కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. నూతన పాలక వర్గం సభ్యులు ఐక్యంగా పనిచేసి దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అలాగే భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించే దిశగా అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు,గ్రామ పెద్దలు, భక్తులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పట్లోళ్ల మాధవి రెడ్డి అభ్యర్థిత్వం రద్దు చేయండి..

**చర్యలకు ఉపక్రమించిన కాంగ్రెస్ పార్టీ..**

**ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిన డీసీసీ అధ్యక్షురాలు**

**స్పాట్ వాయిస్, బ్యూరో:** మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో జారీ చేసిన పార్టీ విప్ ను ధిక్కరించిన సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం ఇస్నాపూర్ 8వ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల మాధవిరెడ్డి అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి



జిల్లా ఎన్నికల అధికారికి గురువారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీలో చైర్మన్ ఎన్నిక సమయంలో కాంగ్రెస్ కౌన్సిలర్లకు జారీ చేసిన విప్ కు విరుద్ధంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన మోతె సుమలత చైర్మన్ కావడానికి మద్దతు ఇచ్చారని లేఖలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ వాళ్ల ప్రలోభాలకు మాధవి లొంగిపోయారన్నారు. బీఆర్ఎస్ మద్దతుతోనే మాధవి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయ్యారన్నారు. చట్టపరంగా ఎన్నికకు ముందు జారీ చేసిన విప్ ను ధిక్కరించారని అందుకు ఆధారాలు ఉన్నాయని లేఖలో వివరించారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించిన కౌన్సిలర్ మాధవి అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని నిర్మలా జగ్గారెడ్డి జిల్లా ఎన్నికల అధికారికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

# పదిచోట్ల ఉప ఎన్నికలు ఖాయం..

- కడియంను చూసి ప్రజలు నవ్వుకుంటాండ్లు..
- దమ్ముంటే రాజీనామా చేసి గెలువు..
- శ్రీహరి మానసిక పరిస్థితి బాగాలేదు..
- కేసీఆర్‌ను విమర్శించే అర్హత లేదు..
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**స్పాట్ వాయిస్, బ్యూరో:** రేవంత్ రెడ్డిని నమ్ముకుని పోతే కుక్క తోక పట్టుకొని గోదారి ఈదినట్లేనని, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇది తెలుసుకోవాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలన్నారు. కేసీఆర్ జాతిపిత ఎలా అవుతాడని కడియం చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కడియం శ్రీహరి తన హోదాకు మించి మాట్లాడుతున్నాడని, కడియంలా కేసీఆర్ ఎప్పుడూ ఆత్మగౌరవాన్ని తాకట్టు బెట్టుకొని, పదవుల కోసం పాకులాడి, బేరసారాలు చేయలేదన్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా, 13ఏళ్లు నిరంతరం పోరాడాడని ఇదే కడియం శ్రీహరి అనలేదా అని సూటిగా ప్రశ్నించారు. ఈరోజు ఏ మొహం పెట్టుకొని ఈ వ్యాఖ్యలు చేస్తున్నాడు ఆయనకే తెలియాలన్నారు. రాజకీయ అవసరాల కోసం రంగులు మార్చిన నీ లాంటి వారు కేసీఆర్‌ను అనే అర్హతల లేదని విమర్శించారు. ఇప్పుడు ఏ పాలో ఉన్నాడో ఆయనకే స్పష్టత లేదని ఎద్దేవా చేశారు.

**ఉప ఎన్నికలు ఖాయం..**

రాష్ట్రంలో పది చోట్ల ఉప ఎన్నికలు రావడం ఖాయ మని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు డిస్క్వాలిపై కావడం ఖాయమన్నారు. న్యాయ స్థానంలో పది మంది అనర్హులుగా ప్రకటింపబడతారని, స్పీకర్ తీర్పు కాపీలు ఇప్పటి వరకు స్పీకర్ ఇవ్వలేదని, కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. న్యాయ స్థానాలను సీఎం రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నడని ఆరోపించారు. పది మందిపై స్పీకర్ నిర్ణయం తీసుకున్నాక మళ్లీ తాము న్యాయ స్థానాలకు పోతామని స్పష్టం చేశారు. పది మంది ఎమ్మెల్యేల పరిస్థితి దిక్కు తోచకుండా ఉందని, కడియం శ్రీహరి మానసిక పరిస్థితి సరిగా లేదన్నారు. నాలుగు దశా బ్దాల రాజకీయ అనుభవం ఉన్న కడి యం శ్రీహరిని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఆ రోపించారు. కేసీఆర్ కడియం శ్రీహరికి కేసీఆర్ రా జకీయ భిక్ష పెట్టిండని, కేసీఆర్ కాళ్లు పట్టుకుని కడియం శ్రీహరి ఎంపీ అయ్యాడని చెప్పారు. ఆరోజు కేసీఆర్ దేవుడు అన్న కడియం శ్రీహరి ఇప్పుడు కనిపిస్తలేదా అంటూ ప్రశ్నించారు. కారు గుర్తుతో గెలిచి న కడియం శ్రీహరి దమ్ముంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అంటేనే కేసీఆర్, కేసీఆర్ అంటే తెలంగాణ అని గుర్తుపెట్టుకోవాలన్నారు.

# కర్రెగుట్టల్లో ఎన్ కౌంటర్

- ఐదుగురు మావోలు హతం..
- దేవ్ జీ, కేసా సోధికోసం వేట..
- కేంద్ర డెడ్ లైన్ కు 40 రోజులే
- కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న బలగాలు

**స్పాట్ వాయిస్, బ్యూరో:** ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో గురువారం భద్రతాబలగాలకు, మావోయిస్టులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతాబలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు సమాచారం. మృతుల వివరాలను అధికారవర్గాలు వెల్లడించాల్సి ఉంది. 'నక్సల్స్ మిషన్–2026' లో భాగంగా సీఆర్పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు 'కేజీహెచ్–2' (కర్రె గుట్టలు హిల్స్–2)ను రెండు రోజుల క్రితం ప్రారంభించాయి. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి దేవ్‌జీ, జూనియర్ క్యాడర్‌కు చెందిన బెటాలియన్ ఇన్‌ఛార్జి కేసా సోధి కోసం 2 వేల మందితో కూడిన బలగాలు వేటను ప్రారంభించాయి. కర్రెగుట్టల్లోని తడపల, పామునూరు, మురుమూరు, డోలీ వంటి ప్రాంతాల్లో ఎఫ్ఓబీ (ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్) లను ఏర్పాటు చేసి సీఆర్పీఎఫ్ బలగాలు నిత్యం ఆపరేషన్ చేపడుతున్నాయి. తాజాగా చేపట్టిన 'కేజీహెచ్–2' సైతం అత్యంత వ్యూహాత్మక ఆపరేషన్‌గా భావిస్తున్నారు.



**మిగిలింది 40రోజులే..**

ఆపరేషన్ కగార్‌ను 2024 జనవరి 1న కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది.తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ అడవులు, మహారాష్ట్ర, ఒడిశా వంటి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఈ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. పలువురు కీలక నేతలతో పాటు వందలాది మావోయిస్టులు ఎదురుకాల్పుల్లో మృతిచెందారు. రంపచోడవరం అడవుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ అగ్రనేత మోస్ట్ వాంటెడ్, గెరిల్లా దాడుల వ్యూహకర్త మడివి హిడ్మా కూడా మృతి చెందారు. మల్లోజుల వేణుగోపాల్ వంటి అగ్రనేతలు 1000మందికి పైగా లొంగిపోయారు. ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టు ఉద్యమం బలహీనపడింది. మార్చి 31నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్రం నిర్దేశించింది. ఇందుకోసం కేవలం 40రోజులు మాత్రమే సమయం ఉండటంతో భద్రతా బలగాలు మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్ ముమ్మరం చేశారు. భద్రతా బలగాల కూంబింగ్ ఆపరేషన్ల నేపథ్యంలో పలువురు మావోయిస్టులు తెలంగాణ వైపు పారిపోయి వచ్చినట్లుగా తెలుస్తుంది. దీంతో తెలంగాణ, ఏపీ, ఒడిస్సా సరిహద్దుల వెంట, ఛత్తీస్ గఢ్ అడవుల్లో మావోయిస్టుల కదలికలపై భద్రతా బలగాలు ఫోకస్ చేశారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న టెన్షన్ నెలకొంది.

## తెలంగాణలో రేవంత్ రాజ్యాంగం

**భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి**

**స్పాట్ వాయిస్, హైదరాబాద్:** తెలంగాణలో రాజ్యాంగానికి అవహేళన జరుగుతోందని, మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ లేకున్నా దురహంకారంతో కాంగ్రెస్ గెలవాలని ప్రయత్నం చేసిందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సంఖ్యా బలం లేకున్నా మంత్రి వివేక్, ఆయన కుమారుడు అధికారులను బ్లాక్ మెయిల్ చేసి క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎ న్నికను వాయిదా వేయించారని ఆరోపించారు. రా ష్ట్రంలో రేవంత్ రెడ్డి రాజ్యాంగం నడుస్తోందని, ముఖ్య మంత్రి, మంత్రులు నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర




కేబినెట్ అంతా ఢిల్లీలో కూర్చుందని, ఢిల్లీలో దేని మీద సమీక్ష చేస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పంపుతున్న లెక్కలపై సమీక్ష చేస్తున్నారా..? కేరళ ఎన్నికల లెక్కల పై సమీక్ష చేస్తున్నారా..? అంటూ ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నిక ల్లో కాంగ్రెస్ ను ప్రజలు భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. ఆయన వెంట క్యామ మల్లేష్, బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.

సినిమా స్పాట్
3
వరంగల్
www.spotvoicenews.com
గురువారం 19, ఫిబ్రవరి 2026

# బైకర్ అప్‌డేట్

చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా నటిస్తున్న మొట్టమొదటి తెలుగు స్పోర్ట్స్ రేసింగ్ డ్రామా 'బైకర్' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ స్థాయి అంచనాలు నెలకొన్నాయి. యంగ్ డైరెక్టర్ అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే విడుదలై సినిమాపై మరింత ఆసక్తిని పెంచేలా చేసింది. అయితే, తాజాగా ఈ సినిమా థియేట్రికల్ బిజినెస్ డీల్ విజయవంతంగా పూర్తయినట్లు టాలీవుడ్ వర్గాల్లో సమాచారం. ప్రముఖ నిర్మాత దిల్ రాజు నైజాం, ఏపీ రాష్ట్రాల థియేట్రికల్ హక్కులను సుమారు రూ. 20 కోట్లకు భారీ ధరకు సొంతం చేసుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. దిల్ రాజు లాంటి అగ్ర నిర్మాత పంపిణీ చేస్తుండటంతో ఈ సినిమాకు డిస్ట్రిబ్యూషన్ పరంగా మరింత బలం చేకూరినట్లయింది. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ రేసింగ్ చిత్రంలో యాంగ్రీ స్టార్ రాజశేఖర్ ఒక పవర్‌ఫుల్ కీలక పాత్రలో కనిపించనున్నారు. అందాల భామ మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, గిబ్రాన్ సంగీతం అందిస్తున్నారు. అన్ని హంగులతో సిద్ధమవుతున్న 'బైకర్' మూవీని వేసవి కానుకగా ఏప్రిల్ 3వ తేదీన థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.




# ‘జననాయగన్’ సెన్సార్ కష్టాలు

తమిళ స్టార్ హీరో దళపతి విజయ్ నటిస్తున్న చివరి ప్రతిష్టాత్మక చిత్రం ‘జన నాయగన్’ విడుదలకు నోచుకోక ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. సుమారు రూ.300 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు అభ్యంతరాలు ప్రధాన అడ్డంకిగా మారాయి. సినిమాలో మతపరమైన సున్నిత అంశాలు, ఆర్మీని ఉద్దేశపూర్వకంగా అవమానించేలా డైలాగులు ఉన్నాయని సెన్సార్ సభ్యులు పేర్కొనగా, అటు కోర్టుల నుంచి కూడా ఎలాంటి సానుకూల తీర్పు రాలేదు. దీనికి తోడు చిత్ర పరిశ్రమ పెద్దల నుంచి కనీస మద్దతు లభించకపోవడం దర్శకుడు హెచ్. వినోద్ తో పాటు నిర్మాతలను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టే ముందు నటిస్తున్న ఆఖరి చిత్రం కావడంతో అభిమానులు భారీ అంచనాలతో ఎదురుచూస్తున్నారు. వాస్తవానికి జనవరి, ఫిబ్రవరి నెలల్లో విడుదల కావాల్సిన ఈ సినిమా ఇప్పుడు వాయిదాల పర్వంతో సతమతమవుతోంది. ప్రస్తుతం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉందని గట్టిగా ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోవడంతో విజయ్ ఫ్యాన్స్ తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు.



# ధురంధర్ 2 యూ/ఏ

బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రణ్వీర్ సింగ్, సారా అర్జున్ జంటగా ఆదిత్య ధర్ దర్శకత్వంలో రూపొందిన సెన్సేషనల్ హిట్ చిత్రం ‘ధురంధర్’. ఇప్పుడు దీనికి సీక్వెల్‌గా వస్తున్న 'ధురంధర్ 2'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా సెన్సార్‌కి సంబంధించిన ఆసక్తికర వివరాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మొదటి భాగం రన్‌టైమ్ ఏకంగా మూడున్నర గంటలు ఉండగా, ఈ సీక్వెల్ నిడివి దానికి ఒక పది నిమిషాలు తక్కువగా సెట్ చేసినట్లు తెలుస్తోంది. ఇక ఇందులో బిగ్ ఛేంజ్ ఏంటంటే.. మొదటి భాగానికి సెన్సార్ బోర్డ్ 'ఏ' (A) సర్టిఫికెట్ ఇవ్వగా, 'ధురంధర్ 2'కి మాత్రం 'యూ/ఏ' (U/A) సర్టిఫికెట్ జారీ చేసినట్లు సమాచారం. ఈ మార్పు సినిమాకి ప్లస్ అవుతుందా అనేది వేచి చూడాలి. పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ చిత్ర తెలుగు వెర్షన్‌పై మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.






# సాంగ్ ప్రోమో

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ హరీష్ శంకర్ క్రేజీ కాంబినేషన్ లో మైత్రీ మూవీ మేకర్స్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న మోస్ట్ అవేటెడ్ మాస్ ఎంటర్టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన ఫస్ట్ సాంగ్ సోషల్ మీడియాలో సూపర్ హిట్ గా నిలవగా, తాజాగా సెకండ్ సాంగ్ 'ఆరా ఆఫ్ ఉస్తాద్' ప్రోమోను మేకర్స్ అట్టహాసంగా రిలీజ్ చేశారు. రాక్‌స్టార్ దేవిశ్రీప్రసాద్ తనదైన మార్క్ మాస్ బీట్స్ తో అభిమానులకు మళ్ళీ 'గబ్బర్ సింగ్' రోజులను గుర్తుకు తెస్తున్నారు. హరీష్ శంకర్ టేకింగ్ తో కూడిన పవన్ కళ్యాణ్ విజువల్స్ పవర్ ఫుల్ గా ఉన్నాయి. ఫుల్ సాంగ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న అభిమానుల కోసం ఫిబ్రవరి 22న పూర్తి పాటను విడుదల చేయనున్నారు. ఈ సినిమా మార్చి 26న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది.

స్పాట్ వాయిస్
గురువారం 19, ఫిబ్రవరి 2026

SPOT VOICE NEWS.COM SPOT VOICE NEWS.COM SPOT VOICE NEWS.COM

# ఇందిరా మహిళా డెయిరీ పనులను వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- హనుమకొండ కలెక్టరేట్ లో పనుల పురోగతిపై సమీక్ష



**స్పాట్ వాయిస్, హనుమకొండ:** పరకాల ఇందిరా మహిళా డెయిరీ అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు మరింత వేగవంతం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పరకాల ఇందిరా మహిళా డెయిరీ పనుల పురోగతిపై డీఆర్డీఏ, సహకార శాఖల అధికారులతో కలెక్టర్ స్నేహ శబరీష్, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డెయిరీ పనుల పురోగతి, మహిళా సమాఖ్యకు ప్రభుత్వ పరంగా అందించే సహాయ సహకారాలు, తదితర అంశాలపై డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి కలెక్టర్, ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ... పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుకు ఎలాంటి చర్యలు చేపట్టామో వాటి గురించిన సమగ్ర వివరాలు సిద్ధం చేయాలని డీఆర్డీవో మేన శ్రీనుకు సూచించారు. డెయిరీ కి సంబంధించిన సమగ్ర వివరాలు, ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిని గురించి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. 25వేల లీటర్ల కెపాసిటీ కలిగిన ప్రాసెసింగ్ ప్లాంట్ ను ప్రారంభోత్సవం చేసేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో డెయిరీ అభివృద్ధి పనుల పురోగతిలో అధికారులు వేగం పెంచాలన్నారు. అందులో భాగంగా నడికూడలో ఏర్పాటు చేస్తున్న బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ (బీఎంసీయూ) నిర్మాణ పనులు వేగవంతంగా మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. దామెర రోడ్డు నుంచి డెయిరీ ప్లాంట్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసి చర్యలు చేపట్టాలని పీఆర్ ఈఈ ఆత్మారామ్ కు తెలియజేశారు. రోడ్డు పనులను త్వరగా మొదలుపెట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ బీఎంసీయూల ఏర్పాటుకు కావాల్సిన మిషనరీ, క్యాన్లు, వెహికల్ హైరింగ్ కోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో అదనపు డీఆర్డీవో వెంకటేశ్వర్లు, డీపీఎం సరిత, ఏపీఎం దివాకర్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.



# కొడవటంచను సందర్శించిన ఎంపీ

- లక్ష్మీ నరసింహస్వామికి కడియం కావ్య పూజలు
- ఎమ్మెల్యే జీఎస్సార్ తో కలిసి పనుల పరిశీలన

**స్పాట్ వాయిస్, రేగొండ :** కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని గురువారం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సందర్శించారు. ఈ నెల 21వ తేదీన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పున:ప్రతిష్ఠాపన నేపథ్యంలో ఆలయానికి చేరుకున్న ఎంపీ కడియం కావ్య స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ తో కలిసి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కడియం కావ్య మాట్లాడుతూ.. రేగొండ మండలం కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని తెలంగాణలో రెండో యాదాద్రిగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 12.15 కోట్ల భారీ నిధులతో పునరుద్ధరణ పనులు చేపట్టిందన్నారు. ఇటీవల ఫిబ్రవరి 8న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి పనులను, అతిథి గృహాన్ని ప్రారంభించారని తెలిపారు. యాదాద్రి తరహాలో కొడవటంచను తీర్చిదిద్ది, గ్రామీణ పర్యాటక రంగాన్ని, ఆర్థిక ప్రగతిని పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు, మాజీ వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





రేగొండ మండలం కొడవటంచ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన ఎన్ఎస్సార్ సంస్థల అధినేత నాయినేని సంపత్ రావును సత్కరిస్తున్న శాయంపేట మాజీ జెడ్పీటీసీ వంగాల రమాదేవి నారాయణరెడ్డి తదితరులు

-స్పాట్ వాయిస్, శాయంపేట





# పోలీస్ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ జోరు..

- దూసుకుపోతున్న క్రీడాకారులు
- ఇప్పటి మొత్తం 42 పథకాలు..
- అభినందించిన సీపీ సన్ ప్రీత్ సింగ్, టీం మేనేజర్ నాగయ్య

**స్పాట్ వాయిస్, హన్మకొండ :** సైబారబాద్ కమిషనరేట్ ప్రారంభమైన రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ లో వరంగల్ కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు మూడో రోజు కూడా జోరును కొనసాగిస్తున్నారు. ఈ క్రీడల్లో ఇప్పటి వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన క్రీడాకారులు మొత్తం 42 పతకాలను సాధించగా ఇందులో 9 స్వర్ణ పతకాలు, 15 రజత పతకాలు, 18 కాంస్య పతకాలు వున్నాయి. ఇప్పటి వరకు సాధించిన పతకాల్లో ప్రధానంగా అర్చరీ క్రీడల్లో పోలీస్ క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేస్తూ గురువారం ఇండియన్ ఒలింపిక్ విభాగంలో ఎస్సై అనిల్ కుమార్ స్వర్ణం గెలుచుకోగా, మరో క్రీడాకారుడు చలపతి కాంస్య పతకాన్ని సాధించాడు. ఇదే ఆర్చరీ క్రీడాంశంలో టీం విభాగం వరంగల్ కమిషనరేట్ క్రీడాకారులు ఎస్సై ఆనిల్ కుమార్, ఎస్సై మహేందర్, కానిస్టేబుళ్లు రాహుల్, చలపతి బృందం స్వర్ణ పతకాన్ని సాధించారు. మరో క్రీడాంశంలో హ్యామర్ త్రో లో కానిస్టేబుల్ సురేందర్ స్వర్ణ పతకం గెలుచుకోగా, వెయిట్ లిఫ్టింగ్ లో మహిళా కానిస్టేబుల్ భువనేశ్వరి రజిత పతకాన్ని సొంతం చేసుకుంది. పవర్ లిఫ్టింగ్ క్రీడలో కానిస్టేబుల్ కళ్యాణి రజితం, హెడ్ కానిస్టేబుల్ సుజాత, లత, కానిస్టేబుల్ సర్వేశ్ కాంస్య పతకాలను సాధించారు. ఆలాగే మరికొన్ని క్రీడల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రీడాకారులు వివిధ క్రీడల్లో ఫైనల్స్ చేరుకోవడంతో పతకాలను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పతకాలను సాధించిన పోలీస్ క్రీడాకారులను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, టీం మేనేజర్ నాగయ్య క్రీడాకారులకు అభినందనలు తెలియజేసారు.



# కటాక్షపూర్ లో ఘనంగా శివాజీ జయంతి

**స్పాట్ వాయిస్, ఆత్మకూరు :** మండల పరిధి కటాక్షపూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆరె కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ భారతదేశాన మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి, మొ ఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన మరాఠా వీరుడుగా పేరుగాంచారని పలువురు కొనియాడారు. స్త్రీలను గౌరవించి హిందూ ధర్మానికి వన్నెతెచ్చిన ధీరుడని, యువత శివాజీ ఆశయాలను కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో గౌస్ పల్లి, కటాక్షపూర్ సర్పంచ్ లు పసుల కార్తీక్, మమ్మద్ షబానా గ పూర్, ఉప సర్పంచ్ రఘు, వార్డు సభ్యులు ఇరువాల యుగేందర్, వాడుకరి రాజు, సతీష్, అశోక్, ఆరె కుల సంఘ నాయకులు తిప్పారపు కిషన్ రావు, సురవు యువరాజు, కుడుతల రమేష్, లింగదారి రమేష్, సావూరి సుధాకర్, బాసిడి ఆగయ్య, బాసిడి వంశీ, శశి, రఘు, లింగ రావు, రాజు, నాగార్జున, శంకర్ రావు, రాజేశ్వరరావు, నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.



# హైడ్రా కమిషనర్‌ను కలిసిన దివ్యాంగులు

- స్వేచ్ఛ వికలాంగుల కమిటీ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన రంగనాథ్
- వరంగల్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా రావాలంటూ డిమాండ్

**స్పాట్ వాయిస్, హైదరాబాద్ :** వరంగల్ పట్టణంలోని స్వేచ్ఛ వికలాంగుల కమిటీ ప్రతినిధులు గురువారం హైదరాబాద్ లోని హైడ్రా కార్యాలయంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ను మర్యాపూర్వకంగా కలిశారు. మేమంతా మీ అభిమానులమని, వరంగల్‌లో ప్రభుత్వ భూములతో పాటు కబ్జాల చెర నుంచి పేద, మధ్య తరగతి వారి ఇంటి స్థలాలు విడిపించిన తీరును గుర్తు చేసుకుని ఆయనకు ధన్యవాదాలు చెప్పారు. హైదరాబాద్‌లో కూడా కబ్జాదారుల భరతం పడుతున్న తీరు పట్ల హర్షం వ్యక్తం చేశారు. హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఒక సాహసోపేత నిర్ణయం అయితే.. దానికి కమిషనర్‌గా మిమ్ములను నియమించడం మరింత అభినందించదగ్గ విషయమని కొనియాడారు. వరంగల్ పట్టణం తో పాటు.. రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా రావాలని, అప్పుడే భూ కబ్జాలు ఆగుతాయన్నారు. చెరువులు, కాలువలు, రహదారులు, పార్కులు, ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించి న స్థలాలను పరిరక్షించుకో వా లంటే రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా ఉండాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన కమిటీని కమిషనర్‌కు పరిచయం చేసుకున్న అనంతరం కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్వేచ్ఛ వికలాంగుల కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అసద్, ప్రధాన కార్యదర్శి తవుడి శెట్టి జ్యోతి, వైస్ ప్రెసిడెంట్ బొల్లం చైతన్య, ట్రెజరర్ శర్ల శివతేజ, పలువురు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



www.spotvoicenews.com

స్పాట్ వాయిస్

గురువారం 19, ఫిబ్రవరి 2026



SPOT VOICE NEWS.COM SPOT VOICE NEWS.COM SPOT VOICE NEWS.COM






# సమాజ మార్పునకు పంచపరివర్తన్..

- ఆర్ఎస్ఎస్ జాతీయ నేత రామ్ మాధవ్
- ఘనంగా ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలు

**స్పాట్ వాయిస్, హన్మకొండ :** ప్రస్తుత సమాజంలో సమూల మార్పునకు ఆర్ ఎస్ ఎస్ వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 'పంచపరివర్తన్' పేరుతో ఐదు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అఖిల భారతీయ కార్యకారిణి సదస్యులు వారణాసి రామ్ మాధవ్ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని వరంగల్ మహానగర శాఖ హంటర్ రోడ్డులోని ఒక ప్రైవేట్ వేడుకల మందిరంలో బుధవారం రాత్రి నిర్వహించిన 'ప్రముఖులతో సంభాషణ' కార్యక్రమంలో రామ్ మాధవ్ ప్రసంగించారు. ఏ సంస్థ అయినా వందేళ్లు పూర్తి చేసుకోవడం అంటే చాలా కష్టమని, చివరికి ఆస్తులు, భవనాలు మాత్రమే మిగులుతాయని, వీటన్నిటికీ భిన్నంగా ఆర్ఎస్ఎస్ దేశ ప్రజల ఆదరాభిమానాలు చూరగొని వందేళ్ల ప్రయాణాన్ని సునాయాసంగా పూర్తి చేసుకొందన్నారు. ప్రభుత్వ సహకారం లేకుండా ప్రజల సహకారంతోనే వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్ అని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సంఘం ఏం చేయనున్నదనే విషయాన్ని సమాజంలోని ప్రతిష్ఠిత వ్యక్తులకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్ఎస్ఎస్ ను అర్థం చేసుకోవడం కష్టమని, అపార్థం చేసుకోవడం సులభం అన్నారు. ఆర్ఎస్ఎస్ ను డాక్టర్ హెడ్గేవార్ 1925లో స్థాపించాక 1950 వరకు 25 ఏళ్లపాటు దేశవ్యాప్తంగా విస్తరించడానికే సమయం పట్టిందన్నారు. అదే సమయంలో 1948లో గాంధీజీ హత్యారోపణ నెపం మోపి సంఘాన్ని ఆనాటి ప్రభుత్వం నిషేధించినా 1950 నుండి 1975 వరకు మరో 25 సంవత్సరాల పాటు స్వయంసేవకుల కృషితో ప్రజలకు చేరువయ్యేలా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని చురగొన్నదని అయినా కూడా రెండోసారి ఎమర్జెన్సీ సమయంలో సంఘం నిషేధానికి గురైందన్నారు. ఆ తర్వాత 1975 నుండి 2000 సంవత్సరం వరకు 25 సంవత్సరాల పాటు దేశంలో అన్ని క్షేత్రాల్లో ఎదిగి ఆనాటి ప్రభుత్వ వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకొని ఆర్ఎస్ఎస్ దేశంలోనే ఒక ప్రభలమైన జాతీయ శక్తిగా ఎదిగి ఒక స్వయం సేవక్ ను ప్రధాని పీఠంపై కూర్చోబెట్టే స్థాయికి ఎదిగిందన్నారు. మతమార్పిడిలకు వ్యతిరేకంగా ఏకాత్మత యాత్రలు నిర్వహించి ప్రజల సంపూర్ణ సహకారంతో అయోధ్య ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. 2000 నుండి ఇప్పటివరకు ఆర్ఎస్ఎస్ కు దేశ ప్రజల సంపూర్ణ సహకారం లభిస్తుండటంతో మరోసారి స్వయం సేవక్ ప్రధాని పీఠాన్ని అధిరోహించి దేశాన్ని పట్టి పీడిస్తున్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ఇదే సమయంలో ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకోవడంతో సమాజ మార్పునకు మరింత కృషి చేయడానికి పంచపరివర్తన్ పేరుతో సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ, పౌర విధులను ఆచరించడం, కుటుంబ ప్రబోధన్ అన్నారు. ఈ ఐదు విషయాలను సమాజంలోని ప్రతి వ్యక్తి పాటించేలా రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలను సంఘం యోజన చేసిందన్నారు. ఇందులో సమాజమంతా భాగస్వాములై దేశాన్ని పరమ వైభవ స్థితికి తీసుకెళ్లాలని కోరారు. చివరగా సభికులు అడిగిన పలు ప్రశ్నలకు రామ్ మాధవ్ సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ వరంగల్ విభాగ్ సంఘ చాలక్ ఆచార్య చిలకమారి సంజీవ, వరంగల్ మహానగర్ సంఘ చాలక్ డాక్టర్ బందెల మోహన్ రావుతోపాటు నగరంలోని ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# యువతకు స్ఫూర్తి ఛత్రపతి శివాజీ పోరాటం..

- బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి
- ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

**స్పాట్ వాయిస్, నర్సంపేట టౌన్ :** దేశభక్తి, ధర్మపరిరక్షణ, స్వశక్తికి ప్రతీకగా నిలిచిన ఛత్రపతి శివాజీ సాహసం, శౌర్యం నేటి విద్యార్థి, యువతరానికి ఆదర్శమని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి అన్నారు. గురవారం బాలాజీ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శివాజీ జయంతి ఉత్సవాలు, రంజాన్ మాస ప్రారంభ కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మి రామానంద్, కౌన్సిలర్ బాణాల ప్రసన్న శ్రీనివాస్, కౌన్సిలర్ మాదాసి రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవన గమనాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. శివాజీ తన పాలనలో మహిళలకు గౌరవం, మర్యాదలు కల్పించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న శ్రీలక్ష్మి కూడా పట్టణాన్ని అభివృద్ధి మార్గంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీ లక్ష్మి రామానంద్ మాట్లాడుతూ విద్యార్థులకు రంజాన్ మాస ప్రారంభ శుభాకాంక్షలు, ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత లక్ష్య సాధన ద్వారానే కుటుంబం, సమాజం, రాష్ట్రం, దేశం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల సెక్రటరీ డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ వనజ, బాలాజీ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మోర్తాల రామరాజు, బిట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# శివాజీ చరిత్ర భావితరాలకు స్ఫూర్తి



**స్పాట్ వాయిస్, నల్లబెల్లి :** హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ చరిత్ర భావి తరాలకు స్ఫూర్తి అని ఆర్ ఎస్ ఎస్ మండల ప్రముఖ్ మార్కండేయ, బీజేపీ మండల అధ్యక్షుడు తడక వినయ్ గౌడ్ అన్నారు. నల్లబెల్లి మండల కేంద్రంలో శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. భారతదేశంలో హైందవ ధర్మాన్ని కాపాడేందుకు ఛత్రపతి శివాజీ చేసిన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. శివాజీ చరిత్ర శాశ్వతంగా ఉండాలని, భవిష్యత్ తరాలు మననం చేసుకోవాలని శ్రీశైలంలో ఆయన స్ఫూర్తి కేంద్రం గొప్పగా ఏర్పాటు చేసుకున్నామని, అది మన తెలుగు రాష్ట్రాల్లో ఉండడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో రామాలయం పూజారి కృష్ణస్వామి, ప్రమోద్, నాగరాజు, రవి, స్థానికులు పాల్గొన్నారు.



# బంధనపల్లిలో శివాజీ జయంతి ఉత్సవాలు

**స్పాట్ వాయిస్, రాయపర్తి :** మండల పరిధి బంధనపల్లి గ్రామంలో శివాజీ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి ఆరె కులస్తులు, గ్రామ పెద్దలు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలోమాజీ సర్పంచ్ కొడగాని ఉమా యాదగిరి, కౌడగాని రమేష్, లడే నాగరాజు, జయంత్ తదితరులు పాల్గొన్నారు.







# ప్రపంచానికే ఆదర్శం అంబేద్కర్..

- అన్ని వర్గాలకు గొప్పవరం భారత రాజ్యాంగం
- అంబేద్కర్ ఇంటి సందర్శన నా అదృష్టం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**స్పాట్ వాయిస్, మంథని :** దేశంలోని బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం గొప్పగా ఆలోచన చేసి రాజ్యాంగం అందించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రపంచానికే ఆదర్శమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. గురువారం లండన్‌లోని ప్రపంచ మేధావి అంబేద్కర్ ఇంటిని ఆయన సందర్శించారు. ముందుగా ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. 76 ఏండ్ల క్రితం అన్ని వర్గాల కోసం అందించిన భారత రాజ్యాంగం మనకు వరంలాంటిదన్నారు. ఆనాడే భవిష్యత్ తరాల కోసం గొప్పగా ఆలోచన చేసిన గొప్ప మహనీయుడని ఆయన కొనియాడారు. ఎన్ని జన్మలెత్తినా అంబేద్కర్ రుణం తీర్చుకోలేమని అన్నారు. అంబేద్కర్ ఇంటిని సందర్శించడం అదృష్టంగా బావిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. నేటి యువత అంబేద్కర్ ఆలోచన విధానాలతో ముందుకు సాగాలని పుట్ట మధూకర్ అని పిలుపునిచ్చారు.

స్పాట్ వాయిస్

గురువారం 19, ఫిబ్రవరి 2026

SPOT VOICE NEWS.COM SPOT VOICE NEWS.COM

# పాఠశాల నుంచే ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

- నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మారెడ్డి
- ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్
- రాష్ట్ర స్థాయికి హరిహరన్, గణేష్ రాజ్, ప్రణవి ఎంపిక
- విజేతలకు బహుమతుల అందజేత




**స్పాట్ వాయిస్, వరంగల్ :** విద్యార్థులు పాఠశాల దశనుంచే నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరం (ఎఫ్ పీఎస్ టీ) ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ ను ప్రభుత్వ ఉన్నత పాఠశాల శంభునిపేటలో నిర్వహించారు. వరంగల్ జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు వెనిశెట్టి కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథి గా ఎన్ఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి హాజరై సీవీ రామన్ ఆవిష్కరణలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని కొత్త కొత్త విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం క్విజ్, ప్రయోగశాల కృత్యాలు ఫిజికల్ సైన్స్ రిసోర్స్ పర్సన్ సుతారి సురేష్ నిర్వహించి, విద్యార్థులను కృత్యాలకు ఆధారంగా ప్రశ్నలను అడిగారు. వరంగల్ జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో టాలెంట్ టెస్టులను నిర్వహించడంపై అభినందనలు తెలిపారు. విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, పాఠశాల దశ నుంచే సాంకేతికత వైపు దృష్టి సారించాలన్నారు. కాగా, టాలెంట్ టెస్ట్ , క్విజ్, ప్రయోగశాల కృత్యాలలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి టి.హరిహరన్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల నరేంద్ర నగర్) , ద్వితీయ బహుమతి జి.గణేష్ రాజ్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల నరేంద్ర నగర్), తృతీయ బహుమతి ఈ.ప్రణవి (ప్రభుత్వ ఉన్నత పాఠశాల గిర్మాజిపేట), కన్సోలేషన్ బహుమతి యు.నమృత (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నల్లబెల్లి) గెలుపొందారు. కాగా విజేతలకు జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు వెనిశెట్టి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ రెడ్డి, కోశాధికారి వేణు కుమార్ బహుమతులు అందజేశారు. అలాగే మెమెంటోలు, పెన్నులను ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు కటంగూరు రాంగోపాల్ రెడ్డి, అందజేయగా, విజేతలకు ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు సత్యనారాయణ వారి నాన్న జ్ఞాపకార్థం నగదు బహుమతులు అందజేశారు. ఉపాధ్యకుడు అనంతగిరి, వాసుదేవరెడ్డి, మనుజెందర్ రెడ్డి, పిన్నింటి బాలాజీ రావు నిర్వహణలో పాలుపంచుకున్నారు. శంభునిపేట ఉన్నత పాఠశాల హెచ్ ఎం రఫీక్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు, వివిధ మండ లాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన 46 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా విశ్వాసం కోల్పోతున్న ప్రభుత్వం

### ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు



**స్పాట్ వాయిస్, హన్మకొండ :** మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినప్పటికీ, ఎన్నికల సరళి, ఓటింగ్ విధానాన్ని చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోతున్నట్లుగానే కనిపిస్తుందని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు గురువారం ప్రకటలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం పోలైన 37 లక్షల ఓట్లలో, కాంగ్రెస్ పార్టీ 15 లక్షల ఓట్లు సాధిస్తే, బీఆర్ఎస్ 11 లక్షల ఓట్లని, బీజేపీ 5 లక్షల ఓట్లను సాధించాయంటే పాలక పక్ష కాంగ్రెస్ కంటే, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు కలిసి ఎక్కువ ఓట్లు సాధించాయన్నారు. దీనిని బట్టి మెజార్టీ ప్రజలు కాంగ్రెస్ పాలన పట్ల అసంతృప్తిగా ఉన్నారని స్పష్టం అవుతుందన్నారు. పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్షాలు కూడా గట్టి పోటీ ఇచ్చాయని, దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ ఇంకా బలంగా ఉండటం వల్ల, కాంగ్రెస్ కి స్థానిక ఎన్నికలలో మెజార్టీ స్థానాలు దక్కాయని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థి సగటున రూ. 20 లక్షల నుంచి రూ. 25 లక్షల ఖర్చు పెట్టారని, అదేవిధంగా కార్పొరేషన్ డివిజన్లలో కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి గెలిచినవారు ఎలా ప్రజాసేవ చేస్తారని విమర్శించారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను అతిక్రమించి ఖర్చు చేస్తున్నా, ఎన్నికల కమిషన్, పోలీస్ డిపార్ట్ మెంట్లు చోద్యం చూడటం వలన ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందని తిరుణహరి వాపోయారు.



## కూలిన సెంట్రల్ బ్యాంకు బిల్డింగ్ గోడ

### నర్సంపేటలో తప్పిన పెను ప్రమాదం

**స్పాట్ వాయిస్, నర్సంపేట టౌన్ :** నర్సంపేట పట్టణం 26వ వార్డు పరిధిలోని సెంట్రల్ బ్యాంక్ బిల్డింగ్ పరద గోడ కూలి కింద ఉన్న షాపుల మీద పడింది. అయితే ఈ ఘటన జరిగిన సమయం ఉదయం కావడం.. అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్దగా నష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న తక్షణమే కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ అక్కడికి చేరుకొని స్థానిక బ్యాంకు మేనేజర్ తో చర్చించి మున్సిపల్ కమిషనర్ కు సమాచారం అందించారు. మున్సిపల్ సిబ్బందితో నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.



## సంపూర్ణ ఆరోగ్యం -సానుకూల జీవన విధానంపై సదస్సు




**స్పాట్ వాయిస్, నర్సంపేట :** మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో నర్సంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'హోలిస్టిక్ వెల్ బీయింగ్ అండ్ న్యూట్రిషన్' సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం 'సంపూర్ణ ఆరోగ్య– సానుకూల జీవన విధానం' అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ 'హోలిస్టిక్ వెల్ బీయింగ్ అండ్ న్యూట్రిషన్' సర్టిఫికెట్ కోర్సు విద్యార్థుల జీవితాలలో విలువైన మార్పులకు దారితీస్తుందని, విద్యతో పాటు జీవన నైపుణ్యాలు కూడా సమానంగా అవసరమని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, సామాజిక కార్యకర్త డాక్టర్ అనిత రెడ్డి హాజరై మాట్లాడారు. నేటి యువత ఒత్తిడులను అధిగమించాలంటే సానుకూల దృక్పథం, సమయపాలన, ధ్యానం, వ్యాయామం వంటి అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు. వెల్ బీయింగ్ అంటే కేవలం శారీరక ఆరోగ్యం మాత్రమే కాదని, మానసిక, సామాజిక, భావోద్వేగ సమతుల్యత కూడా అంతే ముఖ్యమైనవన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు సానుకూల ఆలోచన ధోరణి అలవరుచుకుని, జీవితం లో విజయాన్ని సాధించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిక విభాగం కన్వీనర్ ఎస్.రజిత, మహిళా సాధికారిక విభాగం సభ్యులు ఆర్.రుద్రాణి, డాక్టర్ బి.గాయత్రి, ఆర్.మాధవి, దివ్య, స్వప్న, డాక్టర్ సత్యనారాయణ, రహీముద్దీన్, డాక్టర్ సోమయ్య, అధ్యాపకులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి..

### ఒకరికి తీవ్ర గాయాలు..

**స్పాట్ వాయిస్, కాజీపేట :** కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దర్గా కాజీపేటకు చెందిన పోతరబోయిన శివకుమార్ (22), తన స్నేహితులైన దినేష్, రోహిత్‌తో కలిసి బుధవారం రాత్రి ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా కాజీపేట దర్గా బస్టాండ్ వద్ద జెండా ఎగురవేసేందుకు ఇనుప జెండా స్తంభాన్ని నిలబెడుతుండగా, అది పైనున్న 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించడంతో శివకుమార్, దినేష్‌లు తీవ్రంగా షాక్‌కు గురయ్యారు. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా శివకుమార్ మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడిన దినేష్ ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు కేసు నమోదు చేశామని, మృతదేహానికి పంచనామా నిర్వహించి తదుపరి దర్యాప్తు చేస్తామని వారు పేర్కొన్నారు.

## హసన్‌పర్తిలో ఘనంగా శివాజీ జయంతి



**స్పాట్ వాయిస్, హసన్ పర్తి :** గ్రేటర్ వరంగల్ 66వ డివిజన్ మెయిన్ సెంటర్ వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి ఆధ్వర్యంలో గురువారం చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ హాజరై శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం శివకుమార్ మాట్లాడు తూ, శివాజీ హిందూ ధర్మ రక్షణ కోసం, దేశ స్వాభిమాన పరిరక్షణ కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు అని కొనియాడారు. స్త్రీలకు గౌరవం ఇచ్చిన పరిపాలకుడిగా, పరాక్రమశాలి యోధుడిగా, యువతకు స్ఫూర్తిదాయక నాయకుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను శివాజీ మహారాజ్ వంటి ధైర్య సాహసాలు, దేశభక్తి, ధర్మనిష్ఠ కలిగిన వారిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఎవరో వచ్చి మన దేశాన్ని కాపాడతారని ఎదురు చూడకుండా, మన ఇంటి నుంచే ఒక శివాజీ మహరాజ్ లాంటి నాయకుడిని తయారు చేయాలని ఆకాంక్షించారు. హిందూ సమాజం గర్వంగా నిలబడేలా ధర్మరక్షణలో కృషి చేస్తున్న భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడి కి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మారుపెల్లి రామచంద్రారెడ్డి, నాయకులు పిట్టల కుమారస్వామి, దాసరి రాజు, మేకల హరి శంకర్, చెల్పూరి శంకర్, బల్గాని రవీందర్, రఘుపాల్ రెడ్డి, దాది మధుసూదన్, దాట్ల సునీల్, జీల సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## చత్రపతికి నన్నపునేని ఘన నివాళి

**స్పాట్ వాయిస్, గీసుగొండ :** మండల పరిధి కోనాయమాకుల గ్రామంలో నూతనం గా ఏర్పాటు చేసిన రిసార్ట్ ను గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, తూర్పు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హా జరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచేలా, పర్యాటక అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం శివాజీ జయంతి సందర్భంగా మరాఠాయోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శివాజీ మహరాజ్ ధైర్యం, దేశభక్తి, స్వరాజ్య స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకమని కొనియాడారు.



# పిలిస్తే వచ్చేవాళ్లం..

- వచ్చే జాతరకు తప్పకుండా ఆహ్వానిస్తాం..
- ఆహ్వానం అందితే జాతరకు వస్తాం..
- మంత్రి సీతక్క-రాహుల్ గాంధీ మధ్య సరదా సంభాషణ
- వనదేవతల వీరగాథను వివరించిన సీతక్క
- ఆసక్తిగా విన్న కాంగ్రెస్ పెద్దలు రాహుల్ గాంధీ ఖర్గే

**స్పాట్ వాయిస్, బ్యూరో:** సమ్మక్క–సారలమ్మ వీరగాథను మంత్రి సీతక్క కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీకి వివరించారు. గురువారం ఢిల్లీలో తెలంగాణ మంత్రులతో కాంగ్రెస్ అగ్రనేతలు సమావేశం అయిన విషయం తెలిసింది. ఈ సమావేశంలో మేడారం జాతరను అత్యాద్భుతంగా నిర్వహించినందుకు మంత్రి సీతక్కను కాంగ్రెస్ అగ్రనేతలు అభినందించారు. ఆదివాసీల అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతరపై సుమారు పది నిమిషాల పాటు చర్చించారు. సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ.. మేడారం జాతర చరిత్ర, ప్రాశస్త్యం గురించి మంత్రి సీతక్కను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సమ్మక్క–సారలమ్మల పోరాట గాథ చెబుతుంటే ఖర్గే, రాహుల్ ఆసక్తిగా విన్నారు. సమ్మక్క – సారలమ్మల చరిత్రను దేశవ్యాప్తంగా చాటేందుకు సినిమా తీయాలని రాహుల్ గాంధీ సూచించారు.

## పిలిస్తే వచ్చే వాళ్లం..

సమావేశంలో మంత్రి సీతక్క, రాహుల్ గాంధీ మధ్య కాసేపు సరదా సంభాషణ జరిగింది. మేడారం జాతరకు ఆహ్వానిస్తే తప్పకుండా హాజరయ్యేవారమని రాహుల్ గాంధీ అన్నారు. 'ఆహ్వానిస్తే తాను కూడా తల్లుల దర్శనానికి వచ్చే వాడినంటూ



మల్లికార్జున్ ఖర్గే అన్నారు. అయితే సమయాభావం వల్ల వ్యక్తిగతంగా ఆహ్వానించలేకపోయినట్లు మంత్రి సీతక్క వివరించారు. వచ్చే జాతరకు తప్పకుండా అధికారిక ఆహ్వానం అందిస్తామని సీతక్క అన్నారు. దీంతో 'ఆహ్వానం అందితే తప్పకుండా వస్తామంటూ రాహుల్ గాంధీ, ఖర్గే హామీ ఇచ్చారు.



## భూతగాదాలో హత్యాయత్నం..

### నిందితులకు ఏడేళ్ల జైలు శిక్ష

**స్పాట్ వాయిస్, భూపాలపల్లి:** భూ తగాదాల హత్యాయత్నం కేసులో నిందితులకు భూపాలపల్లి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు 7ఏళ్ల జైలు శిక్ష, రూ.పదివేల జరిమానా విధించింది. 2019లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొర్లవీడు గ్రామంలో భూతగాదాల హత్యాయత్నం కేసు నమోదైంది. గ్రామానికి చెందిన మామిడి రాజకుమార్ తన సోదరులు మామిడి ఓదెలు, మామిడి కుమార్ తో భూమి విషయంలో తరచూ గొడవలు పడుతూ ఉండేవారు. ఈ క్రమంలో 2019 జనవరి 21 మధ్యాహ్నం మామిడి రాజకుమార్, అతని భార్య మామిడి రమ కలిసి, రాజకుమార్ తమ్ముడు మామిడి ఓదెలును గొడ్డలితో తలపై కొట్టారు. దీంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. దీంతో నింది తులు అక్కడి నుంచి పారిపోయారు. పోలీసులు దర్యాప్తు చేసి పక్కా ఆధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వాదనలు వినిపించడంతో న్యాయస్థానం నిందితులకు శిక్ష విధించింది. ఈ కేసు దర్యాప్తులో ఎస్సై సాంబమూర్తి, లైజనింగ్ ఆఫీసర్ వెంకన్న, సీడీఓ లావణ్య కీలక పాత్ర పోషించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ వారిని అభినందించారు.

## మార్చి 15లోపు నామినేటెడ్ పోస్టులు

**స్పాట్ వాయిస్, బ్యూరో:** కాంగ్రెస్ లో నామినేటెడ్ పోస్టుల జాతర మొదలుకానుంది. టీపీసీసీ అధ్యక్షుడి ప్రకటనతో ఆశావహుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. వచ్చే నెల 15వ తేదీ లోపు నామినేటెడ్ పోస్టుల భర్తీ చేయనున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఢిల్లీలో పార్టీ పెద్దలతో సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే మూడేళ్ల తర్వాత కూడ రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఎన్నికల్లో చెప్పిన హామీలన్నీ అమలు చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో 80 శాతం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని మహేశ్‌కుమార్ పేర్కొన్నారు.

# కేసీఆర్ ఒక్కడి వల్లే రాష్ట్రం రాలే..

- జాతిపిత అనడానికి సిగ్గుండాలి..
- ఏం చేసిండని జాతిపిత అయిండు..
- తెలంగాణ వాళ్ల అయ్య సొత్తా..?
- కేసుల పాలైన కల్వకుంట్ల కుటుంబం
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్పాట్ వాయిస్, రఘునాథపల్లి:** దేశానికైనా, రాష్ట్రానికైనా ఉన్నది ఒక్కరే జాతిపిత అని, ఆయనే మహాత్మా గాంధీ అని, కేసీఆర్ జాతిపిత అని చెప్పుకోవడానికి బీఆర్ఎస్ నాయకులకు సిగ్గు ఉండాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్ర స్థాయిలో విమర్శించారు. జఫర్ గడ్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో, స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో ఆయన కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు అధికారం వాళ్ల జన్మ హక్కుగా, కల్వకుంట్ల కుటుంబ హక్కుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా విపరీతమైన ధోరణితో నీచమైన విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. సభ్యత సంస్కారం లేకుండా స్థాయిని మరిచి విమర్శలు చేయడం మంచిది కాదని అందుకే ప్రజలు ఓటు రూపంలో తిప్పికొట్టారని అన్నారు. ప్రజలు వాళ్ళ మాటలను పట్టించుకోవడం లేదనడానికి మున్సిపల్ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని వెల్లడించారు. కల్వకుంట్ల కుటుంబం చేసిన అవినీతి, అక్రమాలకు ప్రజలు బీఆర్ఎస్ కు ఓటు వేయడానికి సిద్ధంగా



లేరని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలలో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రాలేదని ఎద్దేవా చేశారు.

## సిగ్గుండాలి..

కేసీఆర్ ను తెలంగాణ జాతిపితా అనడానికి బీఆర్ఎస్ నాయకులకు సిగ్గు ఉండాలని కడియం శ్రీహరి ఫైర్ అయ్యారు. తెలంగాణకు ఏం చేశాడని జాతిపితా అంటున్నారని ప్రశ్నించారు. దేశానికైనా, రాష్ట్రానికైనా ఉన్నది ఒకరే జాతిపిత అని ఆయనే మహాత్మా గాంధీ అని తెలిపారు. కేసీఆర్ ఒక్కడి వల్లే తెలంగాణ రాలేదని ఎంతో మంది ప్రజలు, విద్యార్థులు, యువకులు, మేధావుల ఉద్యమ ఫలితం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అవినీతి, అక్రమాలకు పాల్పడి వందల ఎకరాల భూములు, వేల కోట్ల ఆస్తులు సంపాదించుకున్నారని ఆరోపించారు. 2014కు ముందు కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు ఎన్ని ఇప్పుడు ఉన్న ఆస్తులు ఎన్నో ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. ఇన్ని ఆస్తులు మీరు కష్టపడి చెమటోడ్చి సంపాదించారా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం వాళ్ళ అయ్య సొత్తులా మాట్లాడుతున్నారని అన్నారు. కల్వకుంట్ల కుటుంబంలోని ప్రతీ ఒక్కరూ కేసుల్లో ఇరుక్కున్నారని వాళ్లు కేసులలో ఇరుక్కుంటే తెలంగాణనే అవమానిస్తున్నారని మాట్లాడుతున్నారని అన్నారు. ఇంకా ఎన్ని రోజులు తెలంగాణ సెంటిమెంట్ ను వాడుకొని రాజకీయాలు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అభివృద్ధికే పట్టం..

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టారని తెలిపారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో, మున్సిపల్ ఎన్నికలలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో 50శాతానికి పైగా ఓట్లు సాధించి, 70శాతానికి పైగా స్థానాలలో విజయం సాధించామని తెలిపారు. ప్రజలలో కాంగ్రెస్ పార్టీపైన, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పైన నమ్మకం ఏంటో ఈ గెలుపుతో రుజువైందని తెలిపారు. ప్రజలు అందించిన ఈ గెలుపుతో మా బాధ్యత పెరిగిందని అన్నారు. అవినీతి రహిత, పారదర్శక అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వచ్చే రెండు ఏళ్లలో గణనీయమైన అభివృద్ధి సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, సర్పంచులు, కౌన్సిలర్లు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.




# పేరుకు వాళ్లు.. సొమ్ముకు వీళ్లు..

### హాస్టళ్లలో 70కి పైగా అడ్డా లేబర్లు అవసరమంటూ ఇండెంట్

- డమ్మీ పేర్లతో బిల్లులు బుక్కేశారు..
- మెస్ బిల్లులు ఎక్కడని ప్రశ్నిస్తున్న విద్యార్థులు
- కేయూ హాస్టల్ నిర్వహణలో అవినీతి బాగోతం..
- విద్యార్థి సంఘాలు ఆందోళన చేసినా పట్టించుకోని కేయూ పెద్దలు
- బాధ్యతల నుంచి తప్పిస్తే సరిపోతుందా..? రికవరీ ఉండదా..?

**స్పాట్ వాయిస్, ఓరుగల్లు:** కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్లలో జరుగుతున్న అవినీతి ఒక్కొక్కటి వెలుగుచూస్తోంది. విద్య నేర్పే సార్లే.. అక్రమ మార్గంలో సంపాదించేందుకు కుట్రలు చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇక యూనివర్సిటీ హాస్టల్ ఆఫీస్ లో జరిగిన అవినీతి, అక్రమాలు రోజుకోటి బయట పడుతున్నా, వీసీ, రిజిస్ట్రార్‌లు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నట్లు విద్యార్థి సంఘాలు, విద్యార్థులు చర్చించుకుంటున్నారు. హాస్టల్ డైరెక్టర్ అక్రమాలపై విచారణ కమిటీ వేసి రెండు నెలలైనా ఇప్పటి వరకు కమిటీ రిపోర్టు సమర్పించకపోవడం వెనుక మతలబేంటనే ప్రశ్న వస్తోంది. విచారణ కమిటీ రిపోర్టు సమర్పించకుండానే హాస్టల్ డైరెక్టర్ డాక్టర్ ఎల్పీ రాజ్ కుమార్ ను పదవి నుంచి తొలగించడంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. అవినీతి అధికారులను పదవి నుంచి తొలగించి చేతులు దులుపుకుందామనే ఆలోచన కేయూ వీసీ, రిజిస్ట్రార్లు చేస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

## అడ్డా లేబర్ల పేరు మీద అక్రమాలు.. !

కేయూ కామన్ మెస్, మహిళా హాస్టల్ మెస్ లలో 70కి పైగా అడ్డా లేబర్లు అవసరం ఉన్నట్లు హాస్టల్ మాజీ డైరెక్టర్ వీసీ, రిజిస్ట్రార్ ఆమోదం తీసుకుని, డమ్మీ పేర్లతో బిల్లులు పెడుతూ విద్యార్థుల సొమ్మును కాజేస్తున్నారని విద్యార్థి సంఘాలు అనేకసార్లు ఆందోళనలు చేశాయి. అయినా అధికారులు చర్యలు తీసుకున్న పాపాన పోలేదని విద్యార్థి సంఘాలు వాపోతున్నాయి. గతంలో అడ్డా లేబర్ల పేరు మీద పెట్టిన బిల్లులను వెలికితీసి విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేసినా.. వాటి గురించి విచారణ కమిటీ పట్టించుకోవట్లేదని విద్యార్థులు వాపోతున్నారు. పని చేయని వారి పేర్లను కూడా అడ్డా లేబర్ల కింద చూపించి వారి జీతాన్ని కేర్ టేకర్, జాయింట్ టేకర్లకు చెల్లించుకొని వాటిని పంచుకుంటున్నారని, వీటిని బయట పెట్టకుండా కమిటీ సభ్యులు కూడా జాప్యం చేస్తున్నారని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అడ్డా లేబర్ల ఆమో దంలో వీసీ, రిజిస్ట్రార్ లతో నిబంధనలకు విరుద్ధంగా ఆమోదం తీసుకున్నట్టు తెలుస్తోంది. 6 నెలల నుంచి అడ్డా లేబర్ల బిల్లులు, పని చేస్తున్న వారిని పరిశీలించి అవినీతి అధికారుల మీద వెంటనే చర్య లు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## మెస్ బిల్లులు ఎక్కడ...?

నవంబర్, డిసెంబర్ నెల మెస్ బిల్లులు ఇప్పటి వరకు కూడా బయటపెట్టక పోవడం పలు అనుమానాలకు తావిస్తోందని విద్యార్థి సంఘాలు అంటున్నాయి. రూ.3500 నుంచి రూ.4000 వరకు మెస్ బిల్లులు వచ్చే అవకాశం




ఉన్నట్లు, ఈ బిల్లుల్లు ఎక్కువగా ఉన్నందున ఇప్పటి వరకు వాటిని బయట పెట్టకపోవడం అవినీతికి నిదర్శనమని వారు మండిపడుతున్నారు. హాస్టల్ లో జరుగుతున్న అవినీతిని ప్రభుత్వం దృష్టికి సైతం తీసుకెళ్లే ఆలోచనలో విద్యార్థి సంఘాలు ఉన్నట్లు సమాచారం.

# ఈరన్నగుట్ట క్రషర్ అనుమతులు రద్దు చేయాలి

**కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేసిన కోమళ్ల గ్రామస్తులు**

**స్పాట్ వాయిస్, రఘునాథపల్లి:** మండలంలోని కోమళ్ల గ్రామంలో ఉన్న ఈరన్న గుట్ట క్రషర్ అనుమతులు వెంటనే రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు గురువారం గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి నివేదికను అందజేయాలని జిల్లా మైనింగ్ శాఖ ఏడీ విజయ్ కుమార్ ను ఆదేశించారు. అనంతరం కోమళ్ల గ్రామ సర్పంచ్ వల్లాల అశోక్, మాజీ సర్పంచ్ బొల్లపల్లి మంజుల మధుసూదన్ మాట్లాడుతూ.. క్రషర్ నిర్వాహకులు కోమల్ల గ్రామ గత పాలక వర్గానికి తెలియకుండా, కనీసం గ్రామసభ తీర్మానం లేకుండా తహసిల్దార్ నుంచి అక్రమంగా 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' (ఎన్ ఓసీ)ను పొంది ప్రస్తుతం ఈరన్న గుట్ట వద్ద పనులు చేస్తున్నారన్నారు. గత తహసీల్దార్ జారీ చేసిన 'ఎన్వోసీ' తేదీ కన్నా ముందుగానే నాటి సర్పంచ్ బొల్లపల్లి మంజుల నేతృత్వంలోని పాలకవర్గం 17 జూన్ 2019 న గ్రామ పరిధిలో ఉన్న పొట్టి గుట్ట, ఈరన్న గుట్టపై గ్రానైట్ క్వారీ, క్రషర్ కు సంబంధించి ఎలాంటి తవ్వకాలు జరపొద్దని గ్రామ సభలో తీర్మానం కూడా చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా క్రషర్ నిర్వాకులకు అక్రమంగా జారీ చేసిన ఎన్వోసీని వెంటనే రద్దు చేయడంతో పాటు గ్రామ పాలక వర్గానికి తెలియకుండా దాన్ని జారీ చేసిన గత తహసీల్దార్ పై శాఖ పరమైన విచారణ చేపట్టి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్రా అశోక్, వార్డ్ మెంబర్లు నీల సంపత్, వెలిశాల లావణ్య, బంద మహేశ్వరి, బండి ప్రేమ్ కుమార్, కొరిపెల్లి శ్రీనివాసరెడ్డి, బంద ప్రవీణ్ తాళ్లపల్లి కుమారస్వామి, కన్నారపు ప్రభాకర్, బొల్లపల్లి అశోక్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.





## ప్రైవేట్ పరం చేసే కుట్ర..

ఆర్టీసీని ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తోందని కవిత మండిపడ్డారు. మేఘా కృష్ణా రెడ్డికి మొత్తం ఆర్టీసీని ధారాదత్తం చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో వాటిని అద్దెకు తీసుకొని వారికి కరెంట్, డిపోలను ఆర్టీసీయే ఇస్తుందన్నారు. అదే విధంగా ఎలక్ట్రిక్ బస్సుల్లో పనిచేసే వారందరినీ అవుట్ సోర్సింగ్ నుంచి తీసుకుంటున్నారన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల్లో కూడా ఆర్టీసీ ఉద్యోగులే ఉండాలని కవిత కోరారు. ఆర్టీసీ కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు కూడా ఆర్టీసీ ఉద్యోగుల తరపున జాగృతి ఫైట్ చేస్తుందని భరోసా ఇచ్చారు.

## సచివాలయంలోనే సమావేశం కావాలి

తెలంగాణ రాష్ట్ర కేబినేట్ ను సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తీసుకెళ్లడంపై కవిత మండిపడ్డారు. ఇది తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపర్చటమేనని చెప్పారు. గతంలో మంత్రివర్గం ఎర్రవెల్లికి వెళితే ఇప్పుడు ఢిల్లీకి వెళ్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రివర్గ సమావేశాలు సచివాలయంలోనే జరగాలని అన్నారు. ఉద్యమ ద్రోహులను పక్కన పెట్టుకోని కేటీఆర్ మాట్లాడుతున్నారని అన్నారు. ఎవరు ఉద్యమకారులో, ఎవరు ఉద్యమ ద్రోహులో ప్రజలే నిర్ణయిస్తారని చెప్పారు.



# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- గత ప్రభుత్వం బిల్లు పెట్టింది... గవర్నర్ ఆమోదించలే
- మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- రవాణాశాఖ మంత్రిగా పొన్నం బాధ్యత తీసుకోవాలి
- 24న ఆర్టీసీ కార్మికుల చలో సెక్రటేరియేట్ మద్దతిస్తున్నాం..
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత




**స్పాట్ వాయిస్, బ్యూరో:** ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీని విలీనం చేస్తామని మాట ఇచ్చారని ఈ సందర్భంగా కవిత గుర్తు చేశారు. ఈనెల 26 న రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న సందర్భంగా ప్రతిరోజు ఒక అంశాన్ని ఆమె ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నారు. తెలంగాణ జాగృతి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు గత ప్రభుత్వమే ఆర్టీసీ విలీన ప్రక్రియ బిల్లును పూర్తి చేసిందని...దానికి గవర్నర్ ఆమోదం తెలుపలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బిల్లు ఆమోదం అయ్యేలా చేస్తే సరిపోతుందని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగుల విషయంలో రేవంత్ సర్కార్ అమానవీయంగా ప్రవర్తిస్తుందని మండిపడ్డారు. ఆర్టీసీ ఆర్టీసీ ఉద్యోగుల కాళ్లకు ముల్లు గుచ్చితే పంటితో తీస్తా అని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు వారి గుండెకు గాయమైన సరే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం మొదలైన నాటి నుంచి ఆర్టీసీ ఉద్యోగులపై ఒత్తిడి పెరిగిందన్నారు. చిన్న కారణాలకే వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారంటూ మండిపడ్డారు. ఒత్తిడి తట్టుకోలేక డ్రైవర్లు హార్ట్ ఆటాక్ తో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 16 నుంచి 18 గంటలు పనిచేయిస్తూ ఆర్టీసీ కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ఇబ్బంది పెట్టవద్దని, చిన్న వారిపై ప్రతాపం చూపవద్దని ప్రభుత్వానికి సూచించారు. చిన్న కారణాలకే ఉద్యోగాలు తొలగించిన వారందరినీ వెంటనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కవిత కోరారు. ఈ నెల 24 న ఆర్టీసీ ఉద్యోగులు తలపెట్టిన ఛలో సెక్రటేరియేట్ కార్యక్రమానికి జాగృతి పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. అదే విధంగా వారి రిటైర్మెంట్ బెనిఫిట్స్, జీతాలు పెంపు, పొదుపు చేసుకున్న సొమ్ము ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్య పరిష్కారం కోసం బాధ్యత తీసుకోవాలని కోరారు.

## శ్వేతపత్రం విడుదల చేయాలి

మహాలక్ష్మి పథకం పెట్టి ఆర్టీసీకి 3 వందల కోట్లు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిందని గుర్తు చేశారు. కానీ ఆక్యుపెన్సీ పెరగడం కారణంగా రూ. 6 వందల కోట్లు అవసరమవుతున్నాయన్నారు. మహాలక్ష్మి పథకం ప్రవేశ పెట్టాక ఆర్టీసీకి ఎన్ని నిధులు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని కవిత డిమాండ్ చేశారు. జనంబాటలో భాగంగా ప్రజల దగ్గరకు వెళితే అసలు ఫ్రీ బస్ ఎందుకు పెట్టారంటూ మహిళలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఫ్రీ బస్సు పెట్టాక అందుకు అవసరమైన విధంగా బస్సుల సంఖ్యను మాత్రం పెంచడం లేదన్నారు. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్ ను కూడా ఆర్టీసీకి ప్రభుత్వం అందజేయడం లేదని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో 52 రోజుల పాటు ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేశారని, 33 మంది కార్మికులు కూడా చనిపోయారని కవిత గుర్తు చేశారు. కానీ వారికి ఏ మాత్రం న్యాయం జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూనియన్ల ను పునరుద్దరిస్తామని మాట ఇచ్చిందని వెంటనే ఆ హామీని నిలబెట్టుకోవాలని కవిత కోరారు.

# మే ఫస్ట్ వీక్‌లో పార్టీ

- మంచి ముహూర్తంలో ఏర్పాటు చేస్తాం
- మా పార్టీ మదర్ బోర్డ్ తెలంగాణ
- బోధన్, సిద్దిపేట సహా ఎక్కడి నుంచైనా పోటీ చేస్తా
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ లను ప్రశ్నిస్తూనే ఉంటాం
- ఇప్పుడు రాష్ట్రంలో తామే ప్రధాన ప్రతిపక్షం
- బీఆర్ఎస్ లీడర్లతో టచ్ లో ఉన్నారు..
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

మే మొదటి వారంలో మంచి ముహూర్తం చూసుకొని పార్టీ పెడతామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకంట్ల కవిత తెలిపారు. గురువారం నిర్వహించిన ప్రెస్ మీట్ అనంతరం మీడియాతో చిట్ చాట్ చేశారు. తెలంగాణనే తమ పార్టీ మదర్ బోర్డ్ అన్నారు. తాము పెట్టబోయే పార్టీలో తెలంగాణ తప్పకుండా ఉంటుందన్నారు. తాను బోధన్, సిద్దిపేట సహా రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం తామేనని, ప్రజల సమస్యలను బలంగా లేవనెత్తుతున్నామని అన్నారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో తామే ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ లను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. తెలంగాణలో బీజేపీ అనేది క్రమంగా కనుమరుగవుతుందని ఆమె అన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఏదో ఒక పార్టీ కలిసి పోటీ చేస్తామని చెప్పారు. జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి తమ పార్టీ గుర్తు వచ్చే అవకాశం ఉందని, తమ పార్టీ గుర్తుపైనే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని స్పష్టం చేశారు.

## టచ్ లో బీఆర్ఎస్ లీడర్లు

తమ పార్టీలో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఇస్తామని కవిత తెలిపారు. అయితే యువతకు పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు. రాజకీయాల్లోకి యువత రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు 50 కమిటీలు వేశామని వాటి ద్వారా అనేక చర్చలు చేస్తున్నామని చెప్పారు. తమ పార్టీలో చేరేందుకు చాలా మంది బీఆర్ఎస్ నేతలు ఆసక్తితో ఉన్నారన్నారు. బీఆర్ఎస్ నేతలు చాలా మంది తనతో టచ్ లో ఉన్నారని సందర్భం వచ్చినప్పుడు వివరాలు చెబుతానన్నారు.

## ఫెయిల్ అయిన మగవాళ్ల గురించి మాట్లాడరా?

పార్టీ పెట్టి ఫెయిల్ అయిన మగ నాయకుల గురించి ఎందుకు మాట్లాడారని కవిత ప్రశ్నించారు. షర్మిల ఏపీలో కాకుండా తెలంగాణలో పార్టీ పెట్టడాన్ని చాలా మంది తప్పుబట్టారని, ఆమె ఇప్పుడు ఒక జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలని గుర్తు చేశారు. ఆడవాళ్ల ఫెయిల్యూర్స్ మాత్రమే పెద్దగా చేసి చూపించడం సరికాదని అన్నారు. చిరంజీవి, దేవేందర్ గౌడ్ ఇలా ఏ ఒక్కరూ ఎందుకు ప్రస్తావించారని ప్రశ్నించారు. రాజగోపాల్ రెడ్డి పార్టీ పెడతా అని బీజేపీలో చేరారు.. తర్వాత కాంగ్రెస్ లో చేరారని.. ఇప్పుడు మళ్లీ పార్టీ పెడతా అంటున్నారని తెలిపారు. ఆయన గురించి కూడా ఎవరు మాట్లాడారని.. మహిళలను మాత్రం తక్కువ చేసి చూస్తారని అన్నారు. ప్రజల కోణంలో సామాజిక తెలంగాణ లక్ష్యంగా పార్టీ ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచేది తమ పార్టీయేనని విశ్వాసం వ్యక్తం చేశారు.





Printed, Published & Owned by PALLEBOINA NAGARAJU, Printed at NEW THINK PUBLICATIONS, H.No: 2-9-355/1, Sneha Nagar, NGO's Colony, Road No.19, Hanamkonda, Pin : 506001, Telangana State. email: spotvoicenews@gmail.com, Office No : 7097272172 * RNI NO.TELTEL/2014/62703